క్లుప్తంగా

కల్వర్టు నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి



రక్షణ గోడలు లేకపోవడంతో ఇటీవల డ్రైన్‌లోకి పల్టీ కొట్టిన ట్రాక్టర్ (ఫైల్)

కాజులూరు: మండలంలోని ఉప్పుమిల్లి, దుగ్గుదుర్రు రహదారిలో డ్రెయిన్‌పై కల్వర్టు నిర్మాణం ప్రమాదాలకు నిలయంగా మారింది. సుమారు 16 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కల్వర్టుకు అధికారులు అప్పట్లో ఇరువైపులా రక్షణగోడలు నిర్మించకుండా వదిలివేశారు. దీంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల పాలవుతున్నారు. ఈ కల్వర్టుకు ఇరువైపులా రోడ్డు మలుపు తిరిగి ఉంది. వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పితే సరాసరి డ్రెయిన్‌లోకి పడిపోతున్నాయి. ఇటీవల ఒక ట్రాక్టరు కల్వర్టుపై నుంచి డ్రైన్‌లోకి పడిపోగా డ్రైవరు చాకచక్యంగా వ్యవహరించటంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి రక్షణ గోడలు ఏర్పాటు చేసి కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కోడ్ ముగిసింది.. ముసుగులు తొలగించండి

రామచంద్రపురం రూరల్: ఈ ఏడాది మార్చి 16 నుంచి అమలుల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్‌ను ఈ నెల 6న కేంద్ర ఎన్నికల సంఘం ఎత్తివేసింది. దీంతో రాజకీయ ప్రముఖుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించాల్సిందిగా పలువురు కోరుతున్నారు. ద్రాక్షారామలో కాకినాడ ప్రధాన రహదారిలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పిల్లి అప్పారావు, నున్న వీర్రాజుల విగ్రహాలకు వేసిన ముసుగులను తీసివేయాలని స్థానికులు, అభిమానులు కోరుతున్నారు.

సత్యసాయికి అభినందనలు

మండపేట: ఇటీవల వెలుడిన నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 720 మార్కులకు 671 మార్కులు సాధించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన పదో వార్డు కౌన్సిలర్ శిరంగు జ్యోతి, ఈశ్వరరావు దంపతుల కుమారుడు శిరంగు మధు సత్యసాయిని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విద్యార్థిని పిలిచి ఎమ్మెల్యే వేగుళ్ల మిఠాయి తినిపించి ఆశీర్వదించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఏపీఓ గణపతి తదితరులు

కె.గంగవరం: పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఎన్ఆర్‌జీఎస్ ఏపీఓ గణపతి అన్నారు. మండలంలోని కె.గంగవరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన తన సిబ్బందితో కలసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు మొక్కలకు గార్డెన్ ఏర్పాటు చేయాలని ఎప్పటికప్పుడు నాటిన మొక్కలను కూడా పరిరక్షించాలన్నారు. ప్రస్తుతం కాలుష్య కోరల్లో చిక్కుకున్న సమాజానికి మొక్కలు నాటడం ద్వారా ఆరోగ్యకరమైన వాతారణాన్ని అందించినవారవుతామని దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో మొక్కలు నాటిస్తామన్నారు. ఈసీ సాగస్, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజేతలకు ఈ-పోస్ట్ ద్వారా శుభాకాంక్షలు

రామచంద్రపురం: సార్వత్రిక ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన నాయకులకు ఈ-పోస్ట్ ద్వారా శుభాకాంక్షలు తెలిపేందుకు తపాలా శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెంటెంట్ కె.శేషారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు, అభిమానులు రూ.10 చెల్లించి సమీపంలోని తపాలా కార్యాలయంలో ఈ పోస్ట్ ద్వారా తమ ప్రియతమ నేతలకు శుభాకాంక్షలు తెలియజేయవచ్చన్నారు. ఇలా పంపించిన సందేశాలు నేరుగా నేతలకు వెళ్లాయని, అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

యువతకు ప్రాధాన్యం

రామచంద్రపురం: నూతనంగా ఏర్పాటు కాబోతున్న ప్రభుత్వంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, స్థానిక ఎమ్మెల్యేగా విజయం సాధించిన వాసంశెట్టి సుభాష్‌లు యువతకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి అభివృద్ధిలో కీలక భాగస్వాములను చేస్తారని టీడీపీ నాయకుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త మేడిశెట్టి శేషారావు అన్నారు. శెట్టిబలిజ యువత నేతృత్వంలో శేషారావును పట్టణంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. వాసంశెట్టి సుభాష్ విజయంలో విశేష కృషి చేసిన శేషారావును తాము ఘనంగా సత్కరించుకున్నట్లు చింతాకుల ప్రకాశ్, పలివెల త్రిమూర్తులు, మేడిశెట్టి వెంకటరమణ, కడలి రాంపండు, పంపన సూరిబాబు, గుబ్బల సూరిబాబు తదితరులు పేర్కొన్నారు.

ఈసారైనా చేరికల సంఖ్య పెరిగేనా?

- విద్యార్థుల కోసం అధ్యాపకుల ఇంటిబాట
- అడ్మిషన్లు పెంచేందుకు ఆరాటం
- సప్లిమెంటరీ ఫలితాలపైనే జూనియర్ కళాశాల భవిష్యత్తు



రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల

రాయవరం: విద్యార్థుల చేరికపై రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మనుగడ ఆధారపడి ఉంది. గతేడాది వరకు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఈ కళాశాల ఉండేది. పొలాల మధ్య సౌకర్యాలకు దూరంగా కళాశాల ఉండడంతో విద్యార్థుల చేరికలు తక్కువగా ఉండేవి. బాలికల చేరికలు మరింత తక్కువ. స్థానికుల నుంచి వచ్చిన డిమాండ్ నేపథ్యంలో గత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోకి మార్చారు. ఈ ఏడాదైనా కళాశాలలో చేరికలు పెరిగి కళాశాల విద్యార్థులతో కళకళలాడుతుందని భావిస్తున్నారు. అయితే ఇప్పటి వరకూ కళాశాలలో చేరికలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి.

ప్రారంభానికి ముందుగానే

ఈ జూనియర్ కళాశాలలో విద్యార్థుల చేరిక కోసం అధ్యాపకులు ముందుగానే ఇంటిబాట పట్టారు. ప్రభుత్వం అడ్మిషన్లకు ఇంకా షెడ్యూల్ ప్రకటించకున్నా..తమ కళాశాలలో విద్యార్థుల చేరికలను పెంచాలనే సదుద్దేశంతో ముందుగానే అధ్యాపకులు మాత్రం విద్యార్థులను చేర్పించేందుకు ఆరాట పడుతున్నారు. కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గడంతో అధ్యాపకులంతా కొన్నేళ్లుగా గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని కళాశాలను గ్రామంలోకి మార్చడంతో విద్యార్థులతో పాటు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనైనా అధిక సంఖ్యలో చేరికలు ఉంటాయన్న ఆశాభావాన్ని వారంతా వ్యక్తం చేశారు.

ప్రయోజనాలను వివరిస్తూ..

కళాశాల గ్రామంలోకి రావడంతో విద్యార్థుల చేరికలు పెరిగే అవకాశం ఉంది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కళాశాల ఏర్పాటు చేయడంతో అధ్యాపకులు కూడా నూతనోత్సాహంతో పని చేస్తున్నారు. ఈ కళాశాల పరిధిలోని హైస్కూళ్లకు వెళ్లి పదవ తరగతి విద్యార్థులను ఈ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాల్సిందిగా కోరుతున్నారు. ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను విద్యార్థులకు వివరిస్తున్నారు.

ఇంటిబాట పట్టిన అధ్యాపకులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రాయవరం, లొల్ల, సోమేశ్వరం, వెదురుపాక, వి.సావరం, బిక్కవోలు మండలంలోని కొమరిపాలెం, పందలపాక, కొంకుదురు, అనపర్తి మండలంలోని మహేంద్రవాడ, కొప్పవరం తదితర గ్రామాల విద్యార్థులు వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యపైనే కళాశాల మనుగడ ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. అధ్యాపకుల భవిష్యత్తు కూడా విద్యార్థుల సంఖ్యపైనే ఆధారపడి ఉండడంతో అధ్యాపకులు విద్యార్థుల కోసం ఇంటిబాట పట్టారు.



కళాశాలలో చేరికలకు ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు

ఇదీ గతేడాది పరిస్థితి

ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల చేరికలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు ఉన్నాయి. ప్రస్తుతం ఎంపీసీ-15, బైపీసీ-10, సీఈసీ-18, హెచ్‌ఈసీ గ్రూపులో 12 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఇప్పుడు వీరంతా సెకండియర్‌లోకి వచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకకూ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుకు ఇరువురు వంతున ఆరుగురు, సీఈసీ నలుగురు విద్యార్థులు చేరారు. ఫస్టియర్, సెకండియర్ నాలుగు గ్రూపులకు కలిపి 160 మంది విద్యార్థులు చేరాల్సి ఉండగా, ఫస్టియర్, సెకండియర్ కలిపి కేవలం 65 మంది అడ్మిషన్లు జరిగాయి. అయితే ఫస్టియర్ కేవలం 10 అడ్మిషన్లు మాత్రమే జరిగాయి. ఏప్రిల్‌లో వచ్చిన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అధిక సంఖ్యలో కళాశాలలో చేరికలు జరగలేదు. ప్రస్తుతం జరుగుతున్న సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులపైనే అధ్యాపకులు ఆశలు పెట్టుకున్నారు.

చేరికలు పెంచేందుకు కృషి



కళాశాలలో విద్యార్థుల చేరికలను పెంచేందుకు అధ్యాపకులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. సబ్జెక్టు అధ్యాపకులు తగినంతగా ఉన్నారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య కచ్చితంగా పెరుగుతుందని ఆశిస్తున్నాం. రహదారి చెంతనే ఉండడం, బస్ సౌకర్యం ఉండడంతో విద్యార్థులు అధికంగా చేరుతారని ఆశిస్తున్నాం.

– ఎం.రామారావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాయవరం

మెరుగైన ఫలితాలు

గతేడాది ఇంటర్ సెకండియర్ ఎంపీసీ విద్యార్థి 973, బైపీసీ విద్యార్థికి 868 మార్కులు వచ్చాయి. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో ఎం.అమృతవర్షిణి 447, పి.కార్తీక్-451(ఎంపీసీ), కె.చండీప్రియ 451(సీఈసీ), పి.వెన్నెల 359(హెచ్‌ఈసీ), ఎం.నందిని 355 (బైపీసీ)లు సాధించారు. సెకండియర్ ఫలితాల్లో 771(బైపీసీ), ఎ.జ్యోతిశ్రీ 684(ఎంపీసీ)లు కళాశాలలో అత్యధిక మార్కులు సాధించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



కలువపువ్వు సెంటర్లో డీఎస్పీ ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బృందాలు



కపిలేశ్వరపురం మండలం వల్లూరు ప్రధాన రహదారిలో మార్చ్ చేస్తున్న పోలీసులు

- రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ
- మండపేటలో పోలీసుల కవాతు

మండపేట: నియోజకవర్గంలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ అన్నారు. పట్టణంలోని కలువపువ్వు సెంటర్‌లో అదనపు పోలీసు బలగాలతో శుక్రవారం ఆయన కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రత్యేక పోలీసు బలగాలతో పట్టణ మంతా గస్తీ నిర్వహిస్తున్నామని చెప్పారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపేట నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసులు కీలకపాత్ర పోషించారన్నారు. పోలీసు కవాతులో టౌన్, రూరల్ సీఐలు షేక్ అఖిల్ జమ, కొమ్ముల శ్రీధర్‌కుమార్, ఎస్‌ఐలు హరికోటి శాస్త్రి, చైతన్య, ఏఎస్‌ఐ చిన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీస్ మార్చ్

కపిలేశ్వరపురం: ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా శుక్రవారం మండలంలోని కాలేరు, కేదారిలంక, వీధివారిలంక, వల్లూరు గ్రామాల్లో పోలీసులు మార్చ్ నిర్వహించారు. అంగర ఎస్సై అందె పరదేశి ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు గ్రామ వీధుల్లో మార్చ్ చేశారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసినట్లు లైబ్రరీ నిర్వాహకుడు ఎం.వీర సూరిబాబు తెలిపారు. ఈ మేరకు గత నెల 15 నుంచి ఈ నెల 7 వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదవడం, డ్రాయింగ్, క్రాఫ్ట్స్, స్పోకెన్ ఇంగ్లీషు తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

మండపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో బాలబాలికలకు మూడు వారాల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. శాఖా గ్రంథాలయం అధికారి ఎస్.పూర్ణమ్మ ఆధ్వర్యంలో మే 15న ఈ విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. ఈ వేసవి శిబిరంలో విద్యార్థులకు అనుభవజ్ఞులతో స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, చెస్ వంటి అంశాల్లో శిక్షణ ఇప్పించారు. నీతి కథలు, పద్యాలు రాయడం నేర్పించారు.

మానసిక వికాసానికి విజ్ఞానం సరైన మార్గం

కపిలేశ్వరపురం: మానసిక వికాసానికి విజ్ఞానం సరైన మార్గం అవుతుందని కపిలేశ్వరపురం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అన్నారు. గ్రంథాలయాధికారి డి.శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ముఖ్య అతిథి, స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యత పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని రోజువారీ ప్రక్రియగా మార్చుకోవాలన్నారు. శిబిరంలో కొద్ది రోజులుగా నిర్వహించిన వ్యాసరచన, కవితలు, జనరల్ నాలెడ్జి, తదితర సృజనాత్మక పోటీల్లోని విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం- 2 కార్యదర్శి రవితేజ, వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో సర్టిఫికెట్లు, బహుమతులతో గెలుపొందిన విద్యార్థులు



శిక్షణ పొందిన బాలబాలికలు



విజేతకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

బ్రెయిన్ ట్యూమర్.. బీ కేర్‌ఫుల్


- ఆధునిక ఆపరేషన్లతో తొలగింపు
- పిల్లల్లో, పెద్దల్లోనూ వ్యాధికి అవకాశం
- నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే

రాయవరం: ఆధునిక జీవనశైలితో బ్రెయిన్ ట్యూమర్లు పెరిగిపోతున్నాయి. సకాలంలో వాటిని గుర్తించకపోవడంతో ప్రాణాంతకంగా మారుతున్నాయి. పెద్దలతో పాటుగా పిల్లల్లోనూ ఈ సమస్య కనిపిస్తోంది. ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే నిర్వహిస్తున్నారు.



వ్యాధికి కారణాలు

బ్రెయిన్ ట్యూమర్లు జన్యుపర లోపాల వల్ల, వంశపారంపర్యంగా వస్తాయి. బ్రెయిన్‌కు రేడియేషన్ సోకడం వలన కూడా సమస్య ఉత్పన్నమవుతుంది. సెల్‌ఫోన్ విపరీతంగా వాడడం వల్ల రేడియేషన్ సోకి మెదడులో గడ్డ వచ్చే అవకాశాలు చాలా మెండుగా ఉన్నాయి. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వయసుల వారికి బ్రెయిన్ ట్యూమర్లు వస్తాయి.



లక్షణాలు

బ్రెయిన్‌లో సర్వసాధారణంగా సెల్స్ చనిపోయి కొత్తవి పుట్టుకొస్తుంటాయి. కొన్ని సమయాల్లో కణాలు చనిపోకుండానే కొత్త కణాలు పుట్టుకొచ్చి కొత్తగా వచ్చిన కణాలు ట్యూమర్‌గా (గడ్డ) మారతాయి. కొన్ని గడ్డలు క్యాన్సర్‌గా మారి ప్రాణాలు తీస్తాయి. కొన్ని గడ్డలు ప్రమాదకరమైనవి కావు. ఆపరేషన్ చేసి తొలగించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్ ఉన్నవారిలో విపరీతమైన తలనొప్పి వస్తుంది. వాంతులు అవ్వగానే తలనొప్పి తగ్గుతుంది. ఎక్కువగా ఉదయం వేళల్లో ఈ సమస్య కనిపిస్తుంది.

మాట్లాడటం కష్టంగా ఉంటుంది. వినికిడి సమస్య, చూపు మసకబారడం, నడవడం కష్టంగా ఉంటుంది. ట్యూమర్ సైజును బట్టి, అది బ్రెయిన్లో ఏర్పడిన ప్రదేశాన్ని బట్టి, రకాన్ని బట్టి లక్షణాలు ఒక్కో మనిషిలో ఒక్కో రకంగా కనిపిస్తాయి.

ఆధునిక సర్జరీలతో మెరుగైన జీవితం

న్యూరో సర్జరీలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులతో బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ చేయించుకున్న వారు గతంలో కంటే చాలా మెరుగైన జీవితాన్ని గడపవచ్చు. ఆధునిక వైద్యం ద్వారా నూటికి 90 శాతం రోగికి మంచి జీవితాన్ని ప్రసాదించవచ్చు.10 శాతం మాత్రమే ప్రాణాంతకమైనవి. జనాభాలో ఒకశాతం ప్రజలు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నారు. అత్యాధునిక వైద్య పరికరాలతో బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ చేస్తున్నారు. ఆపరేషన్ చేసేందుకు నాలుగు నుంచి ఎనిమిది గంటల వరకు సమయం పడుతుంది. సుమారు రూ.మూడు లక్షల ఖరీదు చేసే ఆపరేషన్లు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నారు.


ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు



బ్రెయిన్ ట్యూమర్లను ప్రాథమిక దశలోనే గుర్తించే ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ప్రాథమిక దశలోనే తలలో గడ్డలను గుర్తిస్తే ఆపరేషన్లతో పని లేకుండా మందులతో పూర్తిగా నయం చేయవచ్చు. అన్ని ట్యూమర్లకు ఆపరేషన్లు చేయాల్సిన పనిలేదు. ముందుగా గుర్తిస్తే రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ తదితర వైద్య విధానాల ద్వారా నయం చేయవచ్చు.

– డాక్టర్ కార్తీక్, ఎండీ జనరల్ మెడిసిన్, ఇన్‌చార్జ్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, అమలాపురం

చంటిబాబుకు పితృ వియోగం



సత్తి గంగిరెడ్డి(ఫైల్)

రాయవరం: మాచవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత నల్లమిల్లి వెంకటకృష్ణారెడ్డి (చంటిబాబు)కు పితృ వియోగం కలిగింది. చంటిబాబు తండ్రి గంగిరెడ్డి (85) ఈ నెల 4న గుండె పోటుతో మృతి చెందారు. గంగిరెడ్డికి వీర్రాఘవ రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి కుమారులు, కాగా ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చంటిబాబుకు పితృ వియోగం కలగడంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మండపేట నియోజకవర్గ జనసేన్ పార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ, సర్పంచ్ కత్తుల అప్పారావు, ఎంపీటీసీ పలివెల శోభన, మాజీ ఎంపీటీసీలు మేడపాటి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, సత్తి సత్యవతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, సొసైటీ అధ్యక్షులు చింతా రామ్మోహన్‌రెడ్డి, నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, సత్తి ఈశ్వరరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు ద్వారంపూడి ఈశ్వరరెడ్డి, సబ్బెళ్ల కాశీఈశ్వరరెడ్డి, పడాల శ్రీనివాసరెడ్డి, టీడీపీ నేత మేడపాటి రవీంద్రరెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యమివ్వాలి

కాజులూరు: వ్యవసాయ సేద్యంలో సేంద్రియ ఎరువుల వాడకానికి రైతులు ప్రాధాన్యమివ్వాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపాలెం, చేదువాడ గ్రామాల్లో ఆయన రైతులతో మాట్లాడుతూ రసాయన ఎరువుల రేట్లు రోజురోజుకీ పెరిగిపోతుండటంతో సేద్యంలో ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గిపోతుందన్నారు. పైగా పంట ఉత్పత్తులు విషతుల్యమై మార్కెట్‌లో నాణ్యత లోపించే ప్రమా దముందన్నారు. విత్తనశుద్ధికి జీవామృతం వినియోగం, సస్యరక్షణకు గోపేడ, మూత్రం, కషాయం వంటివి తయారు చేసి తెగుళ్లపై వినియోగించవచ్చన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ప్రమాదాలకు నిలయంగా ఉన్న మలుపు

కె.గంగవరం: మండలంలోని తామరపల్లి ప్రారంభంలోని మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రహదారిలో వెంటవెంటనే రెండు సార్లు ప్రమాదకరంగా మలుపులు ఉండడం పక్కనే చెరువు ఉండడం వల్ల ప్రయాణికులు గాయాల పాలవుతున్నారని స్థానికులు అంటున్నారు. రోడ్డుపై అవగాహన లేని ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. రహదారి నిర్మించినప్పటి నుంచి అధికారులకు స్పీడు బ్రేకర్లు వేయాలని వేడుకుంటున్నామని, కనీసం హెచ్చరిక బోర్డులైన ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడు బ్రేకర్లు, బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

టిడ్కో కాలనీలో వసతులు మెరుగుపరచండి

అధికారులతో కలిసి కాలనీని సందర్శించిన ఎమ్మెల్యే వేగుళ్ల



టిడ్కో కాలనీ సమస్యలపై కమిషనర్ రాముతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట: స్థానిక గొల్లపుంత టిడ్కో కాలనీలో సౌకర్యాలు మెరుగు పరచాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మున్సిపల్, టిడ్కో అధికారులను ఆదేశించారు. మండపేట మున్సిపల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, టిడ్కో ఈఈ రీటా, డీఈ శ్రీనివాసరావు తదితర అధికారులతో కలసి శక్రవారం ఆయన ఈ కాలనీని సందర్శించారు. అపార్ట్‌మెంట్ల మధ్యలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్ర పరచాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలోని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వరుసగా నాలుగోసారి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వుంగరాల రాంబాబు, మల్లిపూడి గణేశ్వరరావు, మున్సిపల్ ఆర్ఐ ప్రభాకర్ చౌదరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న ఒక యువకుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బుచ్చెంపేటకు చెందిన జొన్నకూటి శ్రీప్రకాష్ వయస్సు 22 సంవత్సరాలు ఇతనికి రెండు కిడ్నీలు పాడైపోయి గత కొన్ని నెలల నుంచి డయాలసిస్ చేయించడం జరుగుతుంది. వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. వైద్యానికి సహాయం కోరడంతో సంస్థ సభ్యులు అతని ఇంటికి వెళ్ళి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.